


6

భద్రాద్రి ప్రసాదాల్లో నాణ్యత భేష్

నివేదిక అందజేసిన ఆహార భద్రత అధికారులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం


5

మంగళవారం, 29 అక్టోబరు 2024



పొంగులేటికి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన జన్మ దినం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటికి శాలువా కప్పి సీఎం రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఖమ్మం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి బస్తాలు

మార్కెట్‌కు పోటెత్తిన పత్తి

ఈ సీజన్‌లో తొలిసారిగా 40 వేల బస్తాల రాక

6



రైతాంగ సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ రైతుసంఘం నేతలు

6

రైతు రుణమాఫీపై దాటవేత ధోరణి

- రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



అదనపు కలెక్టర్‌గా
శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి.శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డి.మధుసూదన్ నాయక్‌ను మహబూబ్‌నగర్ బీమా ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సిద్దిపేటలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాసరెడ్డిని నియమించారు. మధుసూదన్‌నాయక్‌పై సీఎంఆర్ బియ్యం అవకతవకలపై సరైన అజమాయిషీ లేకపోవడం పట్ల జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన గత పదిరోజులు గా సెలవుపై వెళ్లారు. ఆ సెలవుల్లోనే ఆయనకు బదిలీ అవడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా నియమితులైన పి.శ్రీనివాసరెడ్డి నేడో రేపో బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిసింది.

డీఆర్వోగా వి.భుజంగరావు

ఖమ్మం కలెక్టరేట్: ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా వి భుజంగరావును నియమించింది. రెండేళ్ల క్రితం డీఆర్వోగా పనిచేసిన శిరీషను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. ఆ తర్వాత ఖమ్మం డీఆర్వోగా రాజేశ్వరి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే తాజాగా డీఆర్వోగా భుజంగరావును నియమించడంతో పూర్తిస్థాయిలో రెవెన్యూ విభాగంలో అధికారులు ఉన్నట్టు అవుతుంది. ఈ నేపథ్యంలో డీఆర్వోగా భుజంగరావు బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిసింది.

ఖమ్మం ఆర్డీవో గణేష్ బదిలీ

నూతన ఆర్డీవోగా నరసింహారావు

ఖమ్మంటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) గుంటుపల్లి గణేష్‌ను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో తొర్రూరు ఆర్డీవోగా పనిచేస్తున్న జి.నర్సింహారావును ఖమ్మం ఆర్డీవోగా నియమించారు. గత ఏడాది ఆగస్టు 13న గణేష్ ఖమ్మం ఆర్డీవోగా వచ్చారు. ఏడాదికి పైగా పనిచేసిన ఆయన సోమవారం తొర్రూరుకు బదిలీ అయ్యారు.

మళ్లీ రామనాథమే..

టీడీపీ 'ఖమ్మం' కన్వీనర్‌గా నియామకం



మధిర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్‌గా సీనియర్ నేత వాసిరెడ్డి రామనాథం రెండోసారి నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం పార్లమెంటరీ అధ్యక్షుల పదవీకాలం పూర్తికావడంతో అన్ని కమిటీలకు నూతన అధ్యక్షులను చంద్రబాబు ప్రకటించారు.

నేడు భట్టి పర్యటన

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. బోనకల్, మధిర మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

విదేశాల్లో ఉద్యోగాల కల్పన

జిల్లాలో ఉపాధి కల్పన కార్యాలయం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఖమ్మం జిల్లా ఉపాధి కల్పనాధికారి నల్ల మోతు మాధవి తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ విద్యార్థులకు సైతం విదేశాల్లో ఉద్యోగవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆమె సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటిస్తూ జిల్లా ఉపాధి కల్పన శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

- నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాల్లో అవకాశాలు
- 'టామ్‌కామ్' వెబ్‌సైట్ ద్వారా సమాచారంతోపాటు శిక్షణ
- ప్రతి నెలా రెండు జాబ్‌మేళాలు.. మూడు నెలలకోసారి మెగా జాబ్‌మేళా
- విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన
- డిప్లొమా, డిగ్రీ విద్యార్థులకు సైతం విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు
- నిరుద్యోగుల కోసం 'జాబ్ సీకర్స్ ఖమ్మం' వాట్సాప్ గ్రూప్
- ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.మాధవి



ప్రశ్న: జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చేపడుతున్న చర్యలు ఏమిటి ?

జవాబు: జిల్లాలోని నిరుద్యోగులకు స్థానికంగానే కాకుండా దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతినెల రెండు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. మూడు నెలలకోసారి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం. సెప్టెంబరు చివరిలో నిర్వహించిన మెగాజాబ్ మేళాకు 1,350మంది హాజరవ్వగా 356మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం.

ప్ర: ఉపాధికల్పన శాఖ నిర్వహించే జాబ్‌మేళాకు ఎవరెవరు హాజరు కావొచ్చు ?

జ: 8నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు హాజరుకావచ్చు. స్కిల్, నాన్‌స్కిల్ విభాగాల్లో ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నాం. ప్రతి జాబ్‌మేళాకు 10నుంచి 15కంపెనీలు వచ్చి ప్రతిభ ఉన్న యువతను ఎంపిక చేసుకుంటున్నాయి. ఎక్కువమంది ఖమ్మంలోని షాపింగ్‌మాల్స్ వ్యాపారసంస్థల్లో పని చేసేందుకు ఇష్టపడుతున్నారు.

ప్ర: జిల్లా ఉపాధికల్పనశాఖ కార్యాలయంలో ఎంతమంది నిరుద్యోగులు నమోదై ఉన్నారు.

జ: 8 నుంచి డిగ్రీ వరకు చదివిన 18వేల మంది నిరుద్యోగులు జిల్లా ఉపాధికల్పనశాఖ కార్యాలయంలో నమోదై ఉన్నారు. 15ఏళ్ల నుంచి 54ఏళ్ల వయస్సున్న నిరుద్యోగులు తమ పేరు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందవచ్చు. నేరుగా ఆఫీస్‌కు రాకుండానే ఖమ్మం ఎంప్లాయిమెంట్ ఆఫీస్ వెబ్‌సైట్‌లో తమ పేరు నమోదుచేసుకునే అవకాశం ఉంది. గతంలో మాదిరిగా ఇకపై ప్రతిఏడాది రెన్యువల్ అవసరంలేదు. ఒకసారి నమోదుచేసుకుంటే 54ఏళ్ల వరకు జాబితాలో ఉంటారు. ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి హైదరాబాదు ఉస్మానియా యూనివర్శిటీలోని ఉపాధికల్పన శాఖ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్ర: ఉపాధి కల్పన ద్వారా స్వయం ఉపాధి శిక్షణలు ఇస్తున్నారా ?

జ: గతంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన (పీఎంకేవీవై) పథకం ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేవారు. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోయింది.

ప్ర: నిరుద్యోగులు, విద్యార్థులు ఉపాధి కల్పన శాఖ ద్వారా ఇంకా ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జ: జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ తదితర కళాశాలల్లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన ఇస్తున్నాం. ఐటీఐ, డిగ్రీ నర్సింగ్ చదివిన విద్యార్థులకు సైతం విదేశాల్లో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. చేతివృత్తుల కోర్సుల ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, మెకానిక్, తదితర కోర్సులు చదివిన వారికి ఉద్యోగాల గురించి అవగాహన కల్పిస్తున్నాం. ఐటీఐ, డిప్లొమా చదివిన వారికి (మిగతా 6వ పేజీలో)

'ఆయిల్‌పామ్'కు
మలేషియా దన్ను

- ఉత్పత్తి, యాంత్రీకరణ మెరుగుకు కసరత్తు
- అక్కడి సాగు విధానం, ఉత్పత్తిపై సమగ్ర అధ్యయనం
- ప్రాసెసింగ్ ప్లాంట్లలో ఆధునిక పరికరాల వినియోగంపై దృష్టి
- మలేషియా పర్యటనలో అనుభవంలోకి నూతన విషయాలు
- వెల్లడించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మలేషియాలో ప్రాసెసింగ్‌ప్లాంట్ ఆధునిక యంత్ర పరికరాల తయారీని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆయిల్‌పామ్ సాగుకు మలేషియా పరిజ్ఞానం వినియోగించుకోబోతున్నారు. ఉత్పత్తి, యాంత్రీకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ అధికారులతో ఈనెల 23 నుంచి 25 వరకు మలేషియాలో పర్యటించిన విషయం విదితమే. అక్కడ నాణ్యమైన ఆయిల్‌పామ్ సాగు విధానాలు, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ లో వినియోగిస్తున్న సాంకేతికతను ఇతర ఉత్పత్తులను మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో అధికారుల బృందం అధ్యయనం చేసింది. ఈ నివేదికను అధికారులు మంత్రి తుమ్మలకు అందించారు. పర్యటనపై మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

తొలిరోజు మలేషియా ప్లాంటేషన్, వాణిజ్యం, ఇండస్ట్రీస్‌పై ఆశాఖ మంత్రి దాటో సిరి జోహారి అబ్దుల్ గనీతో సమావేశమై ఆ దేశంలో సాగులో ఉన్న 5.70 మిలియన్ హెక్టార్ల సాగు విధానం గురించి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ ఫ్రూట్‌లో 15.50 శాతం నూనె శాతం కలిగి ఉంది. అక్కడ నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కల సరఫరా, వ్యవసాయవిధానాలు, శ్రామిక పద్ధతులు ప్రాసెసింగ్ మిల్లు అభివృద్ధి, సాంకేతిక పద్ధతులపై చర్చించారు. ఆ తర్వాత మలేషియా ఎక్స్‌టర్నల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌తో సమావేశమై వ్యాపార, వాణిజ్య సంబంధాలపై చర్చించారు. ఆయిల్‌పామ్ పంటల సాగు పరికరాల దిగుమతి అవకాశాల గురించి చర్చించారు.

మలేషియా ఆయిల్‌పామ్ బోర్డు డైరెక్టర్ జనరల్ డాక్టర్ అహ్మద్ పర్వేజ్ హది గులామ్ ఖాదర్‌తో సమావేశమై తెలంగాణలో ఆయిల్‌పామ్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన మానవ వనరుల వినియోగంపై చర్చించారు. కౌలాలంపూర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయిల్‌పామ్ ఎగ్జిబిషన్ తిలకించారు. ఆ తర్వాత సీడ్ గార్డెన్ కేంద్రం, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించారు. ఉత్తమ నర్సరీలను, విత్తన ఉత్పత్తి గురించి చర్చించారు. ఆయిల్‌పామ్ రంగంలో అదనపు ఉత్పత్తులు, (మిగతా 6వ పేజీలో)



కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో కబడ్డీ పోటీల దృశ్యం

కబడ్డీ.. కబడ్డీ..

- కొత్తగూడెంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ ఇన్విటేషన్ టోర్నమెంట్ ప్రారంభం
- మొత్తం 16 జట్లు... ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు... రేపు ముగింపు...

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ ఇన్విటేషన్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా స్థానిక ప్రకాశం స్టేడియంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. పీఎస్ఆర్ ట్రస్ట్, భద్రాద్రి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను అశ్వారావుపేట ఎమ్మెల్యే, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జారే ఆదినారాయణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. అనంతరం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. మొత్తం 16 జట్లు పాల్గొంటున్న ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంచర్ల చంద్రశేఖర్‌రావు, కోనేరు సత్యనారాయణ(చిన్ని), తూము చౌదరి, ఆళ్ళ మురళి, ఊకంటి గోపాలరావు, చీకటి కార్తీక్, తోట దేవిప్రసన్న, వాణిరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి స్వాతిముత్యం తదితరులు పాల్గొన్నారు. కాగా, కబడ్డీ పోటీల కోసం ప్రత్యేకంగా సింథటిక్ కోర్టును ఏర్పాటు చేశారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో సాగుతున్న పోటీలను క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. బుధవారం నాడు ఈ పోటీలు ముగుస్తాయి.

తొలి రోజు కబడ్డీ ఫలితాలివే ...

తొలిరోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించగా వాటి ఫలితాలు (మిగతా 6వ పేజీలో)

ఓటర్ల సంఖ్య... 12,27,230

- ఖమ్మం జిల్లా ముసాయిదా విడుదల
- నేటినుంచి నవంబరు 28 వరకు ఓటుహక్కు నమోదు
- నవంబరు 9,10 న స్పెషల్ డ్రైవ్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో 12,27,230 మంది ఓటర్లతో ముసాయిదా జాబితాను జిల్లా అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఈ నేపథ్యంలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తహసీల్దారు కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శనకు పెట్టారు. ఈ జాబితాలో పేర్లు లేని వారు, 2025 జనవరి 1 వరకు 18 ఏళ్లునిండే వారు కూడా ఓటరుగా నమోదుకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. నేటి నుంచి నవంబరు 28వరకు దరఖాస్తులను స్వీకరించి ఆ తర్వాత వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత తుదిజాబితాను ప్రకటించనున్నారు. దీని కోసం జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో నవంబరు 9,10 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లో బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరిస్తారు. తుది జాబితాను జనవరి 6న ప్రకటించనున్నారు.

జిల్లాలో కొత్త ఓటర్లను నమోదు చేయడంతో పాటు రెండు చోట్ల నమోదైన ఓటర్లను తొలగించారు. వలసలు, మృతిచెందిన వారి ఓటర్లను తొలగించి తాజాగా ఓటర్లతో తుది జాబితాను సిద్ధం చేసి ప్రకటించనున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఈ జాబితాలను ఎన్నికల సిబ్బంది సిద్ధం చేస్తున్నారు.. ప్రస్తుత ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 12లక్షల27వేల 230మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 5లక్షల 91వేల 487మంది, 6లక్షల 35వేల 659మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులుగా 84మంది ఉన్నారు.



ఫైల్

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
ఖమ్మం	155198	168739	49	323986
పాలేరు	116195	125626	7	241828
మధిర	107341	115380	10	222731
వైరా	93985	100026	4	194015
సత్తుపల్లి	118768	125888	14	244670
మొత్తం	591487	635659	84	12,27,320

(వీరితో పాటు జిల్లాలో ఎన్నారై ఓటర్లు 191, సర్వీస్ ఓటర్లు 695మంది ఉన్నారు. వీరిలో 674 మంది పురుషులు, 21 మంది మహిళలున్నారు.)

'కళ'ల స్తంభాద్రి



ఆయన ఓ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన ఎదుగుదల వెనుక ఎన్నో కష్టాలు దాగి ఉన్నాయి. ట్రాక్టర్ డ్రైవర్‌గా, కార్మికుడిగా, సమాజసేవకుడిగా, మంచి కళాకారుడిగా ఎదిగాడు. ఆయనకు చిన్నతనం నుంచి కళలన్నా.. నటన అన్నా ఎనలేని మక్కువ ఉండేది. ఆ ముక్కువే కళాకారుడిగా ఎదగడానికి తోడ్పడింది. విశ్వాస్ యూత్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ విభాగంలో 150 మందికి ఉపాధి అందేలా కృషి చేశాడు. ఆయనే కాకుండా ఆయన భార్యను కూడా సమాజ సేవా కార్యక్రమాల్లో బాధ్యురాలిని చేశాడు. ఆయనెవరో కాదు సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేసిన నాసర్ పాషా.

నాడు కార్మికుడు.. నేడు కళాకారుడు

- కార్మికుడిగా, నాయకుడిగా గుర్తింపు....
- అభిరుచితో కళలపై పట్టు
- నేడు సమాజ సేవకుడిగా సేవలందిస్తున్న నాసర్ పాషా

మణుగూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2 గనిలో ఈపీ ఆపరేటర్‌గా సేవలందించి ఇటీవల కాలంలో మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుడు ఎస్‌డీ నాసర్ పాషా. కార్మికుడిగా తన విధులను నిర్వహిస్తూనే, కార్మిక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంలో ఇప్పు నాయకుడిగా గుర్తింపు పొందాడు. అంతేకాదు కంపెనీలో సాంస్కృతిక విభాగానికి సంబంధించి ఓ కళాకారుడిగా కూడా సుపరిచితుడే.

ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం

నాసర్ పాషా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా నర్సాపురం గ్రామానికి చెందిన వాడు. తొలుత కుటుంబ పోషణ కోసం ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగించాడు. ట్రాక్టర్ డ్రైవింగ్‌ను గ్రామంలోని కొందరు యువతకు నేర్పి ఉపాధి అవకాశాలను చూపాడు. ఆ తర్వాత జంగారెడ్డిగూడెం డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా కూడా కొంత కాలం పనిచేశాడు. తదనంతరం మణుగూరులో సింగరేణిలో ఉపాధిని పొందాడు. ఈపీ ఆపరేటర్‌గా సేవలందించాడు.

సింగరేణి సేవా సమితి నిర్వాహకుడిగా...

నాడు ఏరియా జీఎంగా విధులు నిర్వహించిన మాజీ డైరెక్టర్ జేవీ దత్తాత్రేయులు, పర్సనల్ మేనేజర్ వీఎస్ఆర్ మూర్తిల నేతృత్వంలో పలువురి సహకారంతో సింగరేణి సేవాసమితి ద్వారా ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను సంస్థ తరుపున నిర్వహిస్తూ, పరిసర ప్రాంతాల అభివృద్ధిలో కూడా తన వంతు సహకారాన్ని సేవా సమితి ద్వారా అందించాడు. మెడికల్ క్యాంపుల నిర్వహణ, వరద బాధిత కుటుంబాలకు చేయూతనందించేందుకు కంపెనీ తరుపున కమిటీ కన్వీనర్‌గా సేవలందించాడు.

విశ్వాస్ యూత్‌తో 150 మందికి సెక్యూరిటీ ఉపాధి

జీఎం దత్తాత్రేయుల ప్రోత్సాహం.. సెక్యూరిటీ అధికారి బానయ్య, సీనియర్ జర్నలిస్టులు గణాశంకర్ పూజారి, భైరి శ్రీనివాస్‌ల తోడ్పాటుతో సింగరేణి ఎంప్లాయి, బాడీ బిల్డర్ నాగమల్లేశ్వరరావు అండతో విశ్వాస్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేయించి, ఆనాటి నుంచి నేటి వరకు సెక్యూరిటీ విభాగంలో 150మందికి ఉపాధి అందేలా కృషి చేశారు.

నటుడిగా గుర్తింపు.. కళలపై ఆసక్తి

వృత్తి సింగరేణి కార్మికుడిగా పనిచేసినా, కళలపై తనకున్న ఆసక్తి నాసర్ పాషాను నటుడిగా రాణించడానికి తోడ్పడింది. సింగరేణి కళాకారులు పూజారి గణాశంకర్, యూసఫ్, బిక్కులాల్ రచనలతో రూపొందించిన పలు నాటికల్లో నాసర్ పాషా మంచి నటుడిగా సింగరేణిలో గుర్తింపు పొందాడు. ఆ తర్వాత స్వీయ రచనలతో సింగరేణి రక్షణ వారోత్సవాలు, సింగరేణి పర్యావరణ వారోత్సవాలు, సామాజిక సమస్యలపై కార్మికుల సమస్యలపై పలు నాటికలను ప్రదర్శించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులను కైవసం చేసుకున్నాడు. మిస్టర్ మనీ, చాకలి ఐలమ్మ చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలను పోషించాడు.

నాసర్ పాషా ఒక్కడే కాకుండా తన భార్య జమీలను కూడా సమాజ సేవా కార్యక్రమాల్లో బాధ్యురాలిని చేస్తూ అనేక కార్యక్రమాలను సింగరేణి ఎంప్లాయిస్ వైఫ్స్ అసోసియేషన్ ద్వారా చేయిస్తూ వస్తున్నాడు. నిరంతరం నాసర్ పాషా తాను సమాజ సేవ, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడతానని 'ఆంధ్రజ్యోతి'తో తెలిపాడు.



కనువిప్పు నాటికలో కృష్ణుని పాత్రలో నాసర్ పాషా



కార్మిక సమస్యలపై పిడికిలెత్తి ఆందోళనలో...

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలి

ఏఐఎస్, సీసీఎస్ అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉం దని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఆల్ ఇం డియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్‌సర్వీసెస్- 2024 అధికారులకు, తెలంగాణ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ప్రదర్శనలో భాగంగా జిల్లాకు వచ్చిన అధికారులతో కలెక్టర్ తన ఛాంబర్‌లో సమీక్షించారు. జిల్లాలో విద్య, వైద్యంపరంగా తీసుకున్న చర్యల గురించి కలెక్టర్‌వారికి వివరించారు. అధికారులకు ప్రజలకుసేవ చేసే అవకాశం ఉందని, నేనేం చేస్తున్నాను, సమాజం నానుంచి ఏం ఆశిస్తున్నది, నా పరిధిలో ఏం చేయగలను అనే అంశాలను ఆలోచించాలన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనానికి జిల్లాకు వచ్చిన ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం, ఈ నెల 21నుంచి 28 వరకు 8రోజుల పాటు జిల్లాలో క్షేత్ర పరిశీలన చేసినట్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి తమ పరిశీలనలో ఎదురైన అనుభవాలను కలెక్టర్‌తో పంచుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జెడ్పీ సీఈవో దీక్షా రైనా, ఎంసీహెచ్ఆర్డీ ప్రాంతీయ శిక్షణ కేంద్ర మేనేజర్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాస్



ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖమ్మానికి చెందిన సీనియర్ వైద్యు డు డాక్టర్ బొలికొండ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఐఎంఏ రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో శ్రీనివాసరావు తన సమీపప్రత్యర్థిపై 92ఓట్ల మెజారిటీ లభించింది. రెండేళ్లపాటు ఈ కమిటీ కార్యకలాపాలు నిర్వహించనుంది. ఇదే ఎన్నికల్లో ఖమ్మానికి చెందిన సీనియర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఐఎంఏకు ఖమ్మం కి చెందిన ఇద్దరువైద్యులు రాష్ట్రస్థాయి పదవులు సాధించటం పట్ల జిల్లా ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ జగదీశ్‌బాబు, సీనియర్ వైద్యులు, ఐఎంఏ జిల్లా కమిటీ సభ్యులు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్, ఎక్స్ లయన్ జిల్లా గవర్నర్, రీజినల్ జోనల్ చైర్మన్, ఖమ్మం లయన్స్ క్లబ్ కార్యదర్శి హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రివి చిల్లర వేషాలు

ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మంటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక సీఎం రేవంత్‌రెడ్డి చిల్లరవేషాలు వేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. సోమవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ బావమరిది గృహప్రవేశం జరుపుకొన్నారని, బంధువులతో కలిసి విందు చేసుకుంటుంటే దానిని రేవ్‌పార్టీగా చిత్రీకరించి, తప్పుడు కేసులు బనాయించారన్నారు. సీఎంవో కార్యాలయం నుంచి పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్‌రావటంలో అంతర్యం ఏమిటని తాతా మధుసూదన్ ప్రశ్నించారు. రేవ్‌పార్టీలో ఉన్న మహిళలను, పురుషులను ఎందుకు చూపించటంలేదో చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు చేయిస్తే ఫారిన్ లిక్కర్ దొరుకుతుందని తాతా మధుసూదన్ పేర్కొన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు సివిల్‌సప్లయి, అమృత్ పథకం, హైడ్రాలను ప్రశ్నిస్తున్నారని, అందుకే చిల్లర రాజకీయాలతో వారిపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీ రఘునందనరావు కేటీఆర్‌ను విమర్శిస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని అర్థం అవుతుందన్నారు. విలేకరుల సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు గుండాల కృష్ణ, బిచ్చాల తిరుమలరావు, ఉప్పలవెంకటరమణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ పాల్గొన్నారు.

2 నుంచి హనుమద్ హోమం

భద్రాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నవంబరు 2నుంచి 23 వరకు కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకొని హనుమద్ హోమం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనే భక్తులు హోమ సామగ్రి వెంట తెచ్చుకోవాలని, హోమ రుసుం రూ.616లు అని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణలో కక్షపూరిత పాలన

- దావత్ చేసుకుంటే రేవ్‌పార్టీ అనడం హాస్యాస్పదం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

భద్రాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కక్షపూరిత పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. భద్రాచలంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల గొంతునొక్కితే అంతకుమించి పోరాడుతామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో పాలన గాలికొదిలేసి విదేశీ టూర్ల ద్వారా ప్రజల సొమ్మును ఆగం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నూరుశాతం ఉపఎన్నిక వస్తుందని ఆ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. విద్యార్థులు, ఉద్యోగస్తులు, పోలీసులు సైతం రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నారంటే ప్రజా పాలన ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానె రామకృష్ణ, సోయం రాజారావు, శ్రీనివాసరాజు, ఆకోజు సునీల్‌కుమార్, కణితి రాముడు, కోలరాజు, రేసు లక్ష్మి పాల్గొన్నారు.

దమ్మపేట ఎస్ఐపై మంత్రి తుమ్మల ఆగ్రహం

దమ్మపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట ఎస్ఐపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గండుగులపల్లిలో ఆయన నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం కొందరు కలిసి ఎస్ఐ తమను అకారణంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల ఎస్ఐను తీవ్రంగా మందలించారు. ఎస్ఐ పనితీరు మార్చుకోవాలన్నారు. ఎస్ఐ పనితీరుపై పలుగ్రామాలకు చెందిన ప్రజలు తుమ్మలకు ఫిర్యాదు చేయటం వల్లే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

వ్యవసాయ శాఖ కార్యాలయానికి తాళాలు

బోనకల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పంట నష్ట పరిహారపు జాబితాలను రైతులకు ఇవ్వడం లేదని నిరసిస్తూ సోమవారం మండల వ్యవసాయ కార్యాలయానికి జిల్లా, మండల రైతు సంఘ నాయకులు తాళాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ప్రభుత్వం మంజూరు చేసినా వాటి వివరాలను అధికారులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వారం రోజులుగా జాబితాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘ జిల్లా నాయకులు పారుపల్లి నర్సింహారావు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, కొంగర కృష్ణయ్య, ఏలూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన పత్తి

- ఈ సీజన్‌లో తొలిసారిగా 40 వేల బస్తాలు రాక

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు తెల్లబంగారం (పత్తి) పోటెత్తింది. సోమవారం సుమారు 40వేల పత్తి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు శని, ఆదివారాలు వరుసగా రెండు రోజులు సెలవుల అనంతరం సోమవారం రైతులు భారీగా పంటను తీసుకొచ్చారు. కొత్త పత్తి సీజన్ ప్రారంభమైనాక పంట ఇంత భారీగా రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు కొద్ది రోజుల నుంచి రోజుకు 8వేల నుంచి 10వేల బస్తాలు వస్తుండగా... సోమవారం ఒక్కసారిగా 40వేల బస్తాలకు పైగా అమ్మకానికి రావడం విశేషం. కాగా మార్కెట్‌లో క్వింటాలు పత్తిని నాణ్యతను బట్టి గరిష్ఠంగా రూ. 6,800 లకు, కనిష్ఠంగా రూ. 5,900లు, నమూనా రకాలను రూ. 6,600 ఆన్‌లైన్ బిడ్డింగ్ ధరలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. కొనుగోళ్లను మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ ప్రసాద్ తదితరులు సమీక్షించారు.

ఉద్యమ చరిత్రను నేటి తరానికి అందిద్దాం..

- మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు
- సీపీఐ శతాబ్ది ఉత్సవ లోగో ఆవిష్కరణ

ఖమ్మంటౌన్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): వందేళ్ల ఉద్యమ చరితను నేటి తరానికి అందించి, వారిని ఉద్యమం వైపు ఆకర్షించి కార్యోన్ముఖులను చేయాలని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న జరుగనున్న సీపీఐ శతాబ్దిఉత్సవ లోగోను ఆయన సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవనంలో సీపీఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేశామని కమ్యూనిస్టు పార్టీ త్యాగాలను ఉద్యమ చరిత్రను నేటి తరాలకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ - డిసెంబర్ 26 నుంచి వచ్చేఏడాది డిసెంబర్ 25 వరకు ఏడాద పొడవునా శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతా దేవి పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాకు ఏడు నేషనల్ అవార్డులు

వెల్నెస్ సెంటర్లకు క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ అవార్డుల ప్రదానం



అవార్డులను ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరు సౌకర్యాలను గుర్తించడంతో పాటు సమాజంలో ప్రభుత్వ ఆసుపత్రుల విశ్వసనీయతను మెరుగుపరచడం కోసం వెల్నెస్ సెంటర్లను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్‌ను పాటించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏడు వెల్నెస్ సెంటర్లకు సోమవారం అవార్డులను జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వెల్నెస్ సెంటర్లకు అందించారు. సుజాతనగర్ పీహెచ్‌సీ పరిధిలోని వెల్నెస్ సెంటర్లైన సింగభూపాలెం, ఓల్డ్ అంజనాపురం, ఎంపీ బంజార పీహెచ్‌సీ పరిధిలోని టేకులచేరు, రేగళ్ల పీహెచ్‌సీ పరిధిలో వెల్నెస్ సెంటర్లు, సీతారాంపురం, చాతకొండ, దుమ్ముగూడెం పీహెచ్‌సీలోని మారాయిగూడెం, పాల్వంచ సీహెచ్‌సిలు ఉన్నాయి. వీటికి సర్వీస్ ప్రొవిజన్, పేషెంట్‌రైట్స్, ఇన్‌పుట్‌లు, సపోర్ట్ సర్వీసెస్, క్లినికల్ కేర్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ అవుట్‌కమ్‌ల లాంటి వైద్య నిర్వహణను నూరు శాతం పూర్తి చేసినందుకు వీటికి అవార్డులు దక్కాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.భాస్కర్‌నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌నాయక్, ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు, డాక్టర్లు స్పందన, బాలాజీ, డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై దాటవేత ధోరణి

- రాష్ట్రరైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు

ఖమ్మంటౌన్,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు రుణ మాఫీ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. రైతాంగ సమస్యలపై సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (సీపీఐ) నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ రుణ మాఫీ విషయంలో గందరగోళం అలుముకుందని లక్షలోపు రుణమున్న రైతులకు కూడా మాఫీ వర్తించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ . 2 లక్షల లోపు రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయటంలో విఫలమయ్యిందన్నారు. రుణ మాఫీ విషయంలో వాయిదాలు వేస్తూ రైతులను ఆవేదనకుకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వ చెబుతున్న లెక్కలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నయని రేషన్ కార్డులు లేని రైతుల గుర్తింపు ప్రక్రియ పూర్తై నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో రుణ మాఫీ జమకాలేదని హేమంతరావు పేర్కొన్నారు.

2018కి ముందు రుణం తీసుకొని రీషెడ్యూల్ కాని రుణాలకు కూడా మాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు , వ్యవసాయంలో నష్టాల కారణంగారైతులు వ్యవసాయ రుణాలు చెల్లించలేక పోయారని ఈవిషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రైతు భరోసా కింద రూ. 15వేలు ఇస్తానని హామీ ఇచ్చినా ఇంతవరకు ఇవ్వలేదని వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలన్నారు.

పంటల బీమా రైతు బీమా పకడ్బందీగా అమ లుచేయాలని అలాగే దొడ్డు వడ్లకు క్వింటా రూ. 500బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీని తక్షణం రైతుల ఖాతాల్లో జమ చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హేమంతరావు హెచ్చరించారు. ఈధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ మౌలానా , రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తిగోవిందరావు , రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు ఏపూరి లతాదేవి జిల్లా కార్యవర్గసభ్యులు రైతులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్'కు మలేషియా దన్ను

(5వ పేజీ తరువాయి)

పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.

ఫెడరల్ ల్యాండ్ డెవలప్‌మెట్ అథారిటీచైర్మన్ అహ్మద్ షహేరి చీక్‌తో సమావేశమై ఆయిల్‌పామ్ సాగు ద్వారా సుస్థిర ఆదాయం, ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడంపై చర్చించారు. మలేషియా ఆహారభద్రత మంత్రి మహ్మద్ బిన్ సాబు తో చర్చించి తెలంగాణలో వ్యవసాయం, అనుబంధరంగాల్లో పెట్టుబడుల గురించి చర్చించారు. ఆయిల్‌పామ్ పంటల పరికరాల తయారీ కేంద్రాన్ని కూడా తిలకించారు. ఇండస్ట్రియల్ టెక్నాలజీ ప్రాసెసింగ్ ప్లాంట్లు తయారీకి ఆధునికయంత్రాల పరికరాలనుకూడా తిలకించారు. కాగా, మలేషియా ప్లాంటేషన్ అండ్ పరిశ్రమల శాఖ ద్వారా అత్యధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సహకారం అందించడం, మలేషియాతో వ్యాపారాభివృద్ధికి , రాష్ట్రంలో నూతన సాంకేతికత శిక్షణకు తోడ్పాటు, నాణ్యమైన పామ్‌సీడ్ గార్డెన్ ఏర్పాటు, రాష్ట్రంలో ఆయిల్‌పామ్ విస్తరించేందుకు మలేషియాతో అంగీకారం కుదుర్చుకున్నట్టు మంత్రి తుమ్మల తెలిపారు.

ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు



క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షులు, నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవ వేడుకలను సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఖమ్మం ప్రధాన వీధుల వెంట బైక్ ర్యాలీ చేపట్టారు. క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన హాస్పటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బేబీస్వర్ణకుమారి, బీమనాధుల అశోక్‌రెడ్డి, దుంపల రవికుమార్, కొప్పుల చంద్రశేఖర్, డీసీబీ శివకుమార్ పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలు: మెచ్చా

దమ్మపేట, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నదని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆరోపించారు. దమ్మపేటలో సోమవారం మెచ్చా మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి ఏమాత్రం కానరావడం లేదన్నారు.

కబడ్డీ.. కబడ్డీ..

(5వ పేజీ తరువాయి)

ఇలా ఉన్నాయి. పురుషుల తొలి మ్యాచ్ ఖమ్మం - మెదక్ జట్ల మధ్య జరిగిన లీగ్ అండ్ నాకౌట్ మ్యాచ్‌లో ఖమ్మం 32 పాయింట్స్, మెదక్ 19 పాయింట్స్ సాధించాయి. 13 పాయింట్ల తేడాతో ఖమ్మం జట్టు గెలుపొందింది. ఆదిలాబాద్ - నిజామాబాద్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్ 44 పాయింట్స్, నిజామాబాద్ -32 పాయింట్స్ సాధించాయి. 12 పాయింట్స్ తేడాతో ఆదిలాబాద్ జట్టు గెలుపొందింది. అదేవిధంగా మహిళల విభాగంలో ఖమ్మం - మెదక్ మధ్య జరిగిన సూపర్ లీగ్ మ్యాచ్‌లో ఖమ్మం-45 పాయింట్స్, మెదక్ - 13 పాయింట్స్ సాధించాయి. 32 పాయింట్స్ తేడాతో ఖమ్మం మహిళ జట్టు గెలుపొందింది. హైదారాబాద్ - వరంగల్ మ్యాచ్ జరిగిన మరో మ్యాచ్‌లో హైదారాబాద్ -31 పాయింట్స్, వరంగల్ -23 పాయింట్స్ సాధించగా 8 పాయింట్స్ తేడాతో హైదారాబాద్ జట్టు గెలుపొందింది.

విదేశాల్లో ఉద్యోగాల కల్పన

(5వ పేజీ తరువాయి)

సైతం విదేశాల్లో మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయి

ప్ర: విదేశాల్లో ఉద్యోగాలకు మీశాఖ తీసుకుంటున్న చొరవ ?

జ: విదేశాల్లో ఉద్యోగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'టామ్‌కామ్' అనే వెబ్‌సైట్‌ను రూపొందించింది. సౌదీ, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, లండన్, ఇజ్రాయిల్ తదితర దేశాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆ వెబ్‌సైట్‌లో ప్రకటన చేస్తుంది. అలాగే విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకుంటున్నవారు 'టామ్‌కామ్'లో నమోదుచేసుకోవచ్చు. ఎక్కువగా నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్‌తో పాటు పలురకాల వృత్తులకు సంబంధించి చదువు, అనుభవం ఉన్నవారికి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఖమ్మం జిల్లా నుంచి కూడా కామ్‌కామ్ ద్వారా పలువురు ఇప్పటికే విదేశాల్లో ఉద్యోగాలు పొందారు.

ప్ర: విదేశీ ఉద్యోగాలు పొందాలంటే ఎలాంటి విద్యార్హత ఉండాలి ?

జ: విదేశాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై జిల్లా ఉపాధి కల్పన శాఖ తరుపున టామ్‌కామ్ ద్వారా ముందుగానే నోటిఫికేషన్ విడుదలచేస్తాం. విద్యార్హత కలిగిన వారిని ఎంపిక చేసి వారికి తర్వాత ఇంగ్లీష్, జర్మన్, తదితర భాషలపై రెండు నెలలపాటు శిక్షణ ఇస్తాం. ట్రైనింగ్ అనంతరం ఐఎల్ట్స్ పాసైన వారికి విదేశీ ఉద్యోగం లభిస్తుంది. విదేశాల్లో నర్సింగ్‌కు బాగా డిమాండ్ ఉంది.

ప్ర: నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధి కల్పనశాఖ ద్వారా ఉద్యోగం పొందేందుకు ఎవరిని సంప్రదించాలి ?

జ: ఖమ్మం కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయానికి వచ్చి సంప్రదించవచ్చు. అలాగే de.khammam@gmail.com ద్వారా స్పందించవచ్చు. అలాగే జిల్లాలో నిరుద్యోగ యువకుల సమాచారం అందించేందుకు 'జాబ్ సీకర్స్ ఖమ్మం' వాట్సాప్ గ్రూప్‌ను కూడా జిల్లా ఉపాధి కల్పనశాఖ నిర్వహిస్తోంది.

రామయ్య ప్రసాదాల్లో నాణ్యత ఓకే

భద్రాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రసాదాల తయారీ పూర్తిగా నాణ్యతతోనే తయారు చేస్తున్నారు. ప్రతి నిత్యం స్వామి వారి నివేదనకు, భక్తులకు పంపిణీ, విక్రయానికి వినియోగించే ప్రసాద ముడిసరుకులు సురక్షితమేనని ఆహార భద్రత శాఖ అధికారులు తేల్చారు.

ఈ మేరకు ఆ శాఖ అధికారుల నుంచి భద్రాచలం దేవస్థానం అధికారులకు అధికారికంగా నివేదిక వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాద్రి దేవస్థానం అధికారులు అధికారికంగా మీడియా ప్రతినిధులకు అందజేశారు.

ఇటీవల ఏపీలోని తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యతపై ఆరోపణలు వ్యక్తమైన క్రమంలో రెండు రాష్ట్రాల్లోని ప్రధాన దేవస్థానాల్లో ప్రసాదాల నాణ్యతపై భక్తుల్లో అనుమానాలు సైతం వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో తొలుత స్పందించిన భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తమ దేవస్థానంలో ప్రసాదాల తయారీకి వినియోగించే ముడిసరుకుల నమూనాలను సేకరించి వాటిని పరీక్షించి నివేదిక ఇవ్వాలని ఆహార భద్రత శాఖ అధికారులకు అధికారికంగా లేఖ రాసారు. ఈ క్రమంలో సానుకూలంగా స్పందించిన సంబంధిత అధికారులు దేవస్థానంలో అన్నదానం, ప్రసాదాల తయారీకి వినియోగించే ముడిసరుకులైన బియ్యం, కందిపప్పు, శనగపప్పు, లడ్డూ తయారు చేసిన స్వీటు, జీర, జీడిపప్పు, కిస్‌మిస్, ఇలాచీ, ఆవునెయ్యి, పంచదార నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారుల నుంచి భద్రాద్రి దేవస్థానం అధికారులకు ప్రసాదాల తయారీకి వినియోగించే ముడి సరుకులు సురక్షితంగానే ఉన్నాయని రాష్ట్ర ఆహార భద్రత శాఖ డైరెక్టరేట్ పరిధిలోని ప్రయోగశాల విశ్లేషకుడు అధికారికంగా దేవస్థానం అధికారులకు నివేదిక పంపారు.

బీజేపీని ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టులకే ఉంది

- బీఆర్ఎస్ అహంకారం, కుటుంబ పాలన వలనే కాంగ్రెస్ గెలిచింది
- సీపీఎం కొణిజర్ల మండల మహాసభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మండల కార్యదర్శిగా ఎన్నికైన కుటుంబరావు

కొణిజర్ల,అక్టోబరు28:దేశంలో,రాష్ట్రంలో మతోన్మాద బీజేపీ ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టులకే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. మండల పరిధిలోని చిన్నమునగాలలో సోమవారం సీపీఎం మండల మహాసభ జరిగింది. గ్రామ సెంటర్‌లో పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు. అమెరికాను ఎదుర్కోవాలంటే ఎర్రజెండాతో సాధ్యమని తెలుసుకున్నారన్నారు. మిగిలిన పార్టీలను ఏకం చేసి ముందుకు నడిపించిన మహానీయుడు సీతారాం ఏచూరి అని గుర్తు చేశారు. అవకాశవాదులు వలన బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటి అమలుకాలేదని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పై వ్యతిరేక వలనే కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ చూపిన కుటుంబపరిపాలన, కేసీఆర్, కేటీఆర్ చూపిన అహంకారం వలనే బీఆర్ఎస్ అధికారం కోల్పోందన్నారు. కాంగ్రెస్‌ఆరుగ్యారంటీలు కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమన్నారు. బీఆర్ఎస్ పదివేలు రైతుభరోసా ఇస్తే కాంగ్రెస్ పదిహేనువేలు ఇస్తానని చెప్పి రూపాయి కూడా ఇవ్వడంలేదన్నారు. మహిళలను ఉచితంగా బస్సు ఎక్కించడం తప్పా ఏ వాగ్దానం కాంగ్రెస్ అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల్లో అసంతృప్తి మొదలైందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండ హైడ్రా,మూసి,రేవ్‌పార్టీలని వాటిపై దృష్టి పెడుతున్నారని ప్రజలకు హామీలు పక్కకు పెట్టారన్నారు. మూసినది ప్రక్షాళన చేస్తాం అని చెప్పుతున్నారని, 15వేల పేద కుటుంబాల ఇళ్లను కూలగొడుతామంటే చూస్తు ఊరుకోమన్నారు. పేదలకు డబుల్‌బెడ రూంలు కట్టించి వారికి పునరావాసం కల్పించాకనే మూసి ప్రక్షాళన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా నాయకులు తాళ్ళపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, మేరుగు సత్యనారాయణ, చెరుకుమల్లి కుటుంబరావు, కొండబోయిన నాగేశ్వరరావు, దారగాని రాములు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, చింతపల్లి ప్రసాద్, తాతా పద్మ, బోయినపల్లి శ్రీనివాసరావు, మోత్కూరి వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, రోషన్‌బేగ్, అఫ్జల్, పుల్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొణిజర్ల మండల కార్యదర్శిగా చెరుకుమల్లి

సీపీఎం మండల కార్యదర్శిగా రెండవసారి చెరుకుమల్లి కుటుంబరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 20మందితో కమిటిని ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని చిన్నమునగాల గ్రామానికి చెందిన కుటుంబరావు పార్టీ కార్యక్రమాలపై చురుగ్గా పని చేయడంతో తిరిగి మరోసారి ఎన్నుకున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

ఖమ్మంఖానాపురంహవేలిఅక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఆర్టీసీ బస్సులకు సంభందించి ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయటానికి మంగళవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం సరిరాం తెలిపారు. ఖమ్మం డిపో పరిధిలో సమస్యలకు డీఎం కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం, సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ఆత్మలూ ఉపాధి పనులు చేస్తున్నాయ్!

- 2019లో చనిపోయిన వ్యక్తి మస్టర్లు... రెండు వారాలు పేమెంట్లు
- కెప్టెన్‌బంజర పంచాయతీ కార్యదర్శికి షోకాజ్, గోవింద్రాలలో ఇద్దరు మేట్ల తొలగింపు
- ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఖాతాల్లోకి ఉపాధి సొమ్ము
- కామేపల్లి సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగులోకి



కామేపల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉపాధి హామీ పనుల్లో పలు అవినీతి అంశాలు వెలుగులోకి వచ్చాయి. బర్లగూడెంలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేధిక సోమవారం ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన జరగ్గా ఈ విషయాలు వెలుగు చూశాయి. ఈ సభకు ప్రిసైడింగ్ అధికారిగా డీఆర్‌డీఏ అదనపు పీడీ శిరీష హాజరయ్యారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024లో పనులను తనిఖీ చేశారు. మండలంలోని జోగ్గూడెం, సాతానాగూడెం, రామక్రిష్ణపురం, జగన్నాథతండ, కెప్టెన్ బంజర, గోవింద్రాల, బర్లగూడెంతదితర గ్రామాల నివేదికలు చదివారు. వాటిలో గోవింద్రాలలో అవకతవకలు జరగడంతో సీనియర్ మేట్లను తొలగించాలని అడిషనల్ పీడీ శిరీష ఏపీఓ శ్రీరాణికి ఆదేశించారు. కెప్టెన్‌బంజరలో డబల్ జాబ్ కార్డులు జారీ చేసి ఒకరికి 193 పని రోజులు, మరొకరికి 115రోజులు పనిదినాలు కల్పించారు. ఫీల్డ్‌అసిస్టెంట్ ముక్తి శ్రీను ఫేక్ డాక్యుమెంట్లు చూపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయమని ఆదేశించారు. బర్లగూడెంలో భూక్య రత్న 2019లోనే చనిపోతే అతడి పేరు మీద రెండు వారాలు మస్టర్లు వేసి రూ.1513 అతని ఖాతాలోజమ చేశారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న పోస్ట్‌మాస్టర్ చంద్రశేఖర్ 32రోజులు, ప్రభుత్వ ఉద్యోగులు సుధాకర్, డాక్టర్ శివ 15రోజులు పని చేసినట్లు చూపించారు. వారి ఖాతాల్లో రూ. 9889జమ చేశారు. గవర్నమెంట్ టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు 16 మంది పనిచేసినట్లు చూపించారు. రూ. 103302 వేతనాన్ని వారి ఖాతోల్లోకి మళ్లించి పంచుకున్నారని, ఊరు వదిలి వెళ్లినవారు, మంచాన పడ్డ వారు, బాలింతలు మొత్తం 16మంది ఖాతాల్లో 429 రోజులకు రూ.84606 వేతనం వేయించి ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్లు పంచుకున్నారు. ఖాళీ మస్టర్లు సృష్టించి 10మందికి 30రోజులు పని చేశారని వారిఖాతాల్లో రూ.6895 జమ చేశారు. ఒక్కొక్క కూలీ దగ్గర వారానికి రూ.100-200 చొప్పున 145 మంది కూలీల వద్ద రూ.14,2600వసూలు చేశారని కూలీలు సామాజిక తనిఖీ బృందానికి ఫిర్యాదు చేశారు. ఇలా సుమారు రూ.3లక్షలు వరకు పంచాయతీ కార్యదర్శులు విజయ, రాజేష్‌లపై రికవరి చేయాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా పంచాయతీరాజ్ పనులకు సంబంధించి నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకుండా రూ.8020 కాంట్రాక్టర్‌కు జమ చేశారు. ఏపీడీ వెంకటపతిరాజు పర్యవేక్షణలేని కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చొరవ చూపించాలి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందించిన ప్రతీ ఫిర్యాదుకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్, పి.శ్రీజతో కలిసి అర్జీలను స్వీకరించారు. ప్రతీ ఫిర్యాదుకు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరకాస్తులను స్వీకరించి పరిష్కారానికి ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం రాజేశ్వరి, జడ్పీసీఈవో దీక్షారైనా, డిఆర్డీవో సన్యాసయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సెలవుతో జాకారం పాఠశాల బంద్



ఆళ్లపల్లి,అక్టోబరు(ఆంధ్రజ్యోతి)28:ఆదివారం సెలవుతో పాటు సోమవారం కూడా జాకారం పాఠశాలకు సెలవు వచ్చింది. స్థానిక ఉపాధ్యాయుడు సెలవు పెట్టడంతో మరో ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు వచ్చి ఆటలు ఆడుకుని ఇంటికి వెళ్లారు... ఆళ్లపల్లి మండలం, జాకారం మండల పరిషత్ పాఠశాలకు ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు. సదురు ప్రాధానోపాధ్యాయుడు రెండు రోజులు సెలవు పెట్టడంతో సోమవారం ఆ పాఠశాలకు ఏ ఉపాధ్యాయుడు రాలేదు. విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చి సాయంత్రానికి ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నాం భోజనం ఏర్పాటు చేసేందుకు వంట మహిళ వచ్చినా, బియ్యం ఇచ్చేందుకు ఉపాధ్యాయులు రాకపోవడంతో ఆమె కూడా ఇంటికి వెళ్లిపోయింది. ఈ విషయమై ఆళ్లపల్లి ఎంఈవో శాంతరావును వివరణ జాకారం పాఠశాల బంద్ చేయడానికి గల కారణం తెలియదన్నారు. తెలుసుకుని చెప్పుతాం అన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయాధికారి

కొత్తగూడెంలీగల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లాన్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి సోమవారం వేపలగడ్డ, సుజాతనగర్‌లోని మహత్మజ్యోతిరావు పూలే బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌కు ఆదేశించారు. తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్‌రూంలను న్యాయమూర్తి పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. సౌచాలయాలు శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, సీనియర్ న్యాయవాది మెండు రాజు ఉన్నారు.

ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి

- జీఎం(ఐఆర్) వెంకట రమణ
- సింగరేణిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం

కొత్తగూడెం,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు నిబద్ధతతో పని చేయడం ద్వారా సంస్థ అధిక లాభాలను పొంది, దానిలో భాగస్వాములు అవుతారని జీఎం (ఐఆర్) ఎ. వెంకట రమణ తెలిపారు. సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో మాట్లాడారు. సమగ్రత సంస్కృతి- దేశ పురోభివృద్ధి అనే నినాదం ఈ సంవత్సరపు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈనెల 28 నుంచి 3వరకు సింగరేణి కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల గనులు, డిపార్టుమెంట్లలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భగంగా ఉద్యోగుల సామర్థ్యం, పెంపుదల, సర్క్యులర్ నవీనకరణకు, నైతిక విలువలపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మనంమన చేసే ప్రతి పనిలో నీతి నిజాయితి, పారదర్శకత అవసరమన్నారు. విజిలెన్స్ విభాగం కూడా సింగరేణి సంస్థలో అంతర్భాగమని, ఇది సంస్థలో శ్రేష్ఠతని తీసుకురావానికి కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం అడిషనల్ మేనేజరు విజిలెన్స్ షాకీర్ మోహీనుద్దీన్ విజిలెన్స్ ప్రతిజ్ఞను ఉద్యోగులతో చేయించారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఈఅండ్ఎం) విజిలెన్స్ కే. ప్రసాదరావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ ఎస్‌వి.రమణమూర్తి, సెక్రటరీ సీఎంవోఏఐ అధ్యక్షుడు ఎం. విజయ భాస్కర్‌రెడ్డి, కార్పోరేట్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు

టపాకాయలు.. జాగ్రత్తలు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పర్యావరణ హితంగా ఎకో ఫ్రెండ్లీగా జరుపుకోవాలని పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికులతో పాటు కోర్టులు సైతం సూచిస్తున్నా.. ప్రజలు మాత్రం బాణా సంచా కాల్చకుండా ఉండటం లేదు.. బాణా సంచా కాల్చడం వల్ల పక్షులు, జంతువులు భయపడటం, పొగ, వేడి నిప్పుల కారణంగా చెట్లు, తదితర ప్రకృతికి విఘాతం ఏర్పడుతోంది. శ్వాసకోశ వ్యాధి గ్రస్తులు, హృద్రోగబాధితులు తదితర కొంత మంది అనారోగ్య వంతులుకూడా బాణ సంచా తాలూకు శబ్దాలకు అసౌకర్యాలకు గురవుతుంటారు. చిన్న పిల్లలు సైతం భయపడుతుంటారు.. అయినా ప్రజలు బాణా సంచాపైపే మొగ్గు చూ పుతుండటంతో ప్రతి ఏటా బాణా సంచా విక్రయాలు పెరుగుతున్నాయి.. పండుగకు బాణా సంచా కాల్చడం సరదా.. పిల్లల నుంచి పెద్దల వరకు బాణా సంచా కాల్చేందుకు ఆసక్తి చూపడం సర్వసాధారణం.. అయితే వీటిని కాల్చే సమయంలో ఏమాత్రం ఏమరపాటుగాఉన్నా, తగిన జాగ్రత్తలు పాటించకపోయినా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.. ఈప్రమాదాలు ఒకోసారి తీవ్రస్థాయిలోనూ ఉండి ఆస్తి, ప్రాణ నష్టాలు ఏర్పడవచ్చు. కనుక బాణా సంచా కాల్చే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి..

- బాణా సంచా కాల్చేటప్పుడు కాళ్లకు చెప్పులు ధరించాలి..
- పిల్లలు బాణా సంచా కాల్చేటప్పుడు పెద్దలు వెంట ఉండాలి.
- పొడవాటి క్యాండిల్స్, అగరొత్తులు వంటి వాటిని ఉపయోగించి కొంత దూరం నుంచి బాంబులకు నిప్పంటించాలి, కాల్చేటప్పుడు కళ్లకు కళ్ల జోడు ధరించాలి.
- బాణా సంచాకు నిప్పంటించేటప్పుడు వాటిపైకి వంగినట్లుగా ఉండకూడదు..
- బాంబులపై కుండలు, సీసాలు, టిఫిన్ డబ్బాలువంటివి ఉంచి పేల్చకూడదు.
- ఒక సారి నిప్పంటించిన తరువాత పేలలేదని వెలగలేదని దగ్గరకు వెళ్లి చూడకూడదు.
- కళ్లల్లో బాణా సంచా తాలూకు నలకలు పడితే బాంబులు పేల్చిన చేతులతో వాటిని తీసే ప్రయత్నం చేయొద్దు.
- బాణా సంచా పేల్చుతున్న ప్రదేశాలకు గ్యాస్ సిలిండర్లు, కిరోసిన్ తదితర ఇందనాలు ఉండకుండా చేయాలి.
- బాణా సంచాకాల్చే వారు నూలు, ఖద్దరు వంటి దుస్తులు ధరిస్తే మంచిది.
- గాలి వీస్తున్నప్పుడు రాకెట్లు వంటివి కాల్చకూడదు, కాల్చిన బాణా సంచాను నీరు నింపిన బకెట్‌లో వేయాలి.
- వాహనాలు నిలిపి ఉన్న చోట బాణా సంచాను కాల్చకూడదు.
- బాణా సంచా కాలుస్తున్న సమయంలో ఇంటి తలుపులు , కిటికీలు మూసి ఉంచాలి.
- టపాసులను నేరుగాచేతితో పట్టుకొని కాల్చరాదు.
- టపాసులు కాల్చేటప్పుడు పెంపుడు జంతువులు బయటకు పోకుండా జాగ్రత్త పడాలి.
- చర్మంపై టపాసులు పడినా నిప్పు రవ్వలు పడినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- కాలిన గాయాలపై నీళ్ల పోయటం, సొంత వైద్యం చేయటం మంచిది కాదు.
- గాలికి నిప్పు రవ్వలు, గడ్డి వాముల, గుడిసెల వైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి.

మనసు దోచే మట్టి ప్రమిదలు..

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మట్టి ప్రమిదలు మనసుదోచే శిల్పాల్లా వెలుగుతున్నాయి.. చేతి వృత్తి దారుల అందమైన కళాకృతులు కనువిందు చేస్తుండటంతో మహిళలు ఎంతో ముచ్చటగా కొనుగోలు చేస్తున్నారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం.. దీపాలు వెలుగని దీపావళి ఉండదు.. పండుగను ప్రారంభించేది ముందుగా దీపాలతోనే కనుక ప్రమిదలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు.. దీపావళి పండుగ మరొక్క రోజే ఉండటంతో ప్రమిదల కొనుగోళ్లతో నగ రంలో సందడి ఏర్పడింది.. కుమ్మరులు తయారు చేసే మట్టి ప్రమిదలతోపాటు పలు రకాలు, రంగుల ప్రమిదల విక్రయాలు జరుగుతున్నాయి. టెర్రకోట, తదితర రకాల మృత్తికలతో రూపొందించిన డిజైన్ ప్రమిదలను రాజస్థాన్, తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తీసుకు వచ్చి అమ్ముతున్నారు. సంప్రదాయ మట్టి ప్రమిదలు డజన్ రూ. 50 వరకు ఉండగా వాటిలో పెద్దవి రూ.60కి, డిజైన్ ప్రమిదలను డజను రూ.70కి, పెద్ద వాటిని రూ.100 నుంచి 120 వరకు అమ్ముతున్నారు. లాంతరును పోలిన ప్రమిదల ధర రూ.150 వరకు ఉంది. పెవిలియన్ గ్రౌండ్, సర్దార్ పటేల్ గ్రౌండ్, పాత మునిసిపల్ కార్యాలయం, బైపాస్ రోడ్, వైరా రోడ్ తదితర ప్రాంతాల్లో దీపపు ప్రమిదల విక్రయాలు జరుగుతున్నాయి.



ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు

మధిర, ఎర్రుపాలెంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి

- రైల్వే జీఎంకు బీజేపీ నేత తాండ్ర వినోదరావు వినతి



రైల్వే జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న తాండ్ర వినోదరావు

మధిర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మధిరలో చార్మినార్, ఎర్రుపాలెంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్(స్టాఫ్) ఇవ్వాలని, ఖమ్మంలోని మామిళ్లగూడెం వైపు ప్రవేశగేటు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నేత తాండ్ర వినోదరావు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం సికింద్రాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వేజీఎంను కలిసి ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ప్రయాణీకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అన్ని పునరుద్దరణ జరుగుతున్నందన విజయవాడ- కాజీపేట మధ్యలో పెద్ద రైల్వే స్టేషన్లలో ఒకటిగా ఉన్న మధిరలో చార్మినార్‌కు హాల్టింగ్ ఇవ్వాలని, అలాగే విజయవాడ తర్వాత వచ్చే సరిహద్దు ప్రాంతమైన ఎర్రుపాలెంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. ఈ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వడంతోపాటు ఖమ్మం రైల్వే స్టేషన్‌లోని మామిళ్లగూడెం వైపు బయటకు, లోపలకు వచ్చేందుకు గేటు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించి ఈ అంశాలను తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తాండ్ర వినోదరావు తెలిపారు.

మాసేవలను గుర్తించి సమస్యలు పరిష్కరించండి

- చాతకొండలోని 6వ బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్లు



నిరసన వ్యక్తం చేస్తున్న కానిస్టేబుల్స్

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : తమ సేవలను గుర్తించి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కొత్తగూడెం చాతకొండలోని 6వ బెటాలియన్ పోలీసులు కానిస్టేబుల్స్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం 6 బెటాలియన్ ప్రాంగణం ఎదుట కానిస్టేబుల్స్ నల్ల బ్యాడ్జీలతో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవుతున్న ఒకే పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కానిస్టేబుల్స్ పై సస్పెన్షన్ ఎత్తి వేసి సమస్య పరిష్కారానికి కమిటీ వేసి చర్చలు జరపాలని కోరారు.

స్వగ్రామంలో మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

కల్లూరు, అక్టోబరు 28 రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామం నారాయణపురంలో సోమవారం ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కనకదుర్గ, పొంగులేటి నరసింహారెడ్డి, కృష్ణకుమారి దంపతులు కేక్ కట్ చేసి పరస్పరం మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పొంగులేటి సుధీర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు పైడిమల్లి అంజిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, రొట్టెలు, పండ్లు అందిస్తున్న పొంగులేటి కుటుంబ సభ్యులు

కేసులపాలు చేస్తున్న 'మున్నేరు' కలప

- వరదలో కొట్టుకువచ్చిన కలప దిమ్మెలను ఇళ్లకు తరలించిన వ్యక్తులు
- నిఘా వేసి పట్టుకుంటున్న అటవీశాఖ అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, 28 (ఆంధ్రజ్యోతి): అత్యాశకు పోయి అటవీశాఖ కేసుల్లో ఇరుకుంటున్నారు మున్నేరు పరివాహకంలోని కొంతమంది వ్యక్తులు. వరదలో కొట్టుకుపోతున్న టేకు, ఇతర కలపను ప్రమాదకరంగా ప్రవహించే వరదలో పక్కకు తరలించి ఇప్పుడు తమ నివాసాలకు తరలిస్తుండటంతో అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. గత సెప్టెంబరు 1న మున్నేరు వరద పోటెత్తిన విషయం విదితమే. ఎగువన ఉన్న అటవీ ప్రాంతంతో పాటుగా మున్నేరు పరివాహకం సమీపంలోని సామిల్‌లో ఉన్న కలప మున్నేరు వరదలోకి చేరింది. వరద నీటితో కొట్టుకు వస్తున్న టేకు, ఇతర కలపను ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్, ఇతర ప్రాంతాల్లోని కొంతమంది వ్యక్తులు ప్రాణాలకు తెగించి ఒడ్డుకు తరలించారు.

ఈ క్రమంలో మున్నేరు పరివాహక ప్రాంతాలో తిరిగి రహదారులు ఏర్పాటు కావటంతో పక్కకు పెట్టిన టేకు ఇతర కలప దిమ్మెలను తమ నివాసాలకు తరలిస్తున్నారు. కొంతమంది ఇప్పటికే తరలించారు. కలప తరలింపుపై అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం మున్నే రు పరివాహక ప్రాంతాల్లో నిఘా పెట్టారు. దీంతో వరదలో వచ్చిన కలపను ఇంటికి తరలిస్తున్న వారిని ఇళ్లలో ఉన్న కలపను బయటకు తరలించి పర్నిచర్ తయారు చేసుకునేందుకు ప్రయత్నించే వారిని పట్టుకొని వారిపై అటవీశాఖ కేసులు నమోదు చేస్తున్నారు. ఈ కేసుల్లో ఎక్కువగా హామాలీ కార్మికులు, మున్నేరు పరివాహకంలోని కొంత మంది యువకులు ఇరుక్కొంటున్నారు.

అటవీసంపద నిల్వ ఉంచడం నేరం

● సిద్ధార్థ విక్రమ్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

అనుమతులు లేకుండా కలపను నివాసాల్లో ఉంచిన, తరలించిన అటవీహక్కుల చట్టం మేరకు కేసులు నమోదు చేస్తాం. మున్నేరు వరద పోటు సందర్భంగా రూ. 20లక్షల కలప సామిల్‌ల నుంచి మున్నేరు వరదలో కలిసింది. ఎవ్వరి వద్దనైనా కలప ఉంటే వాటిని స్వచ్ఛందంగా అటవీశాఖకు సమాచారం అందించి అప్పగించాలి.

అనుమానాస్పదంగా ప్రైవేటు హాస్టల్ వార్డెన్ మృతి



రాజేష్(ఫైల్)

ఖమ్మంక్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ ప్రైవేటు హాస్టల్ వార్డెన్ మృతి చెందిన సంఘటన సోమవారం ఖమ్మం నగరశివారులో జరిగింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. ఏన్కూరు మండలం రాంనగర్‌తండాకు చెందిన భూక్యా రాజేష్(21) నగర శివారులోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి హాస్టల్ వార్డెన్‌గా గత మూడునెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం నగర శివారులోని ఓదాబా వద్ద రోడ్డుపై అనుమానాస్పదంగా మృతిచెంది పడి ఉండడంతో స్థానికులు గమనించి, ఖానాపురంహవేలి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనాస్థలంకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి తెలిసిన వారి ద్వారా మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం సమీప బంధువైన అజ్మీర చంటి అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. కాగా రాజేష్ మృతిపై పాఠశాల మీద అనుమానాలున్నాయని కుటుంబసభ్యులు, బంధువులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. మృతుడికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులతో మాట్లాడారు. వారి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

టేకులపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మహిళకు గాయాలైన సంఘటన మండలంలోని తోలెంరామయ్యగుంపు సమీపంలో జరి గింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు మండలం పోలారం పంచాయతీ భద్రుతండాకు చెందిన బానోతు గణేష్ (29) తన బంధువు మండలంలోని కొండంగులబోడు గ్రామానికి చెందిన శేవిరితో కలిసి ద్విచక్ర వాహనంపై బోడువైపునకు వస్తుండగా, తోలెంరామయ్యగుంపు సమీపంలో ఎదురుగా వస్తున్న టాటాఏసీ ట్రాలీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మహిళకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



మద్దులపల్లి ఏఎంసీ డైరెక్టర్ మృతి



తిరుమలాయపాలెం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ బానోతు హస్సేన్(57) సోమవారం మృతిచెందారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాజీ ఎంపీపీ మంగిలాల్, సొసైటీ చైర్మన్ చావ వేణు, నాయకులు వేముల ఉపేందర్, పోట్ల కిరణ్, దాసరి నాగయ్య, శ్రీను నివాళులర్పించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	44రూ.
వంకాయ	58
గుత్తి వంకాయ	60
బీరకాయ	64
పచ్చిమిర్చి	54
కాకరకాయ	54
బెండకాయ	58
పొట్లకాయ	60
దోసకాయ	54-70
గోరుచిక్కుడు	78
క్యాబేజీ	34
దొండ	50-58
సొరకాయ	30
క్యారెట్	48
క్యాప్సికం	84
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	165
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

పశుగణన పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్ అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశు గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 21వ అఖిల భారత పశు గణన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపద అత్యంత కీలకమని, పశు గణనను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని రకాల పశువుల వివరాలను సేకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుమనోహర్, డీఆర్వో రాజేశ్వరి పాల్గొన్నారు.

వరద పరిహారం ఎందుకు జమ చేయలేదు?

- మున్నేరు బాధితులకు తక్షణం పరిహారం పంపిణీ చేయాలి
- లీడ్ బ్యాంకు మేనేజరుకు కేఎంసీ కమిషనర్ ఆదేశాలు
- ప్రజావాణి సమస్యలు వారంలోగా పరిష్కారం కావాలి



బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద బాధితులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తే ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలకు ఎందుకు జమ కాలేదని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య లీడ్ బ్యాంకు మేనేజరును ప్రశ్నించారు. సోమవారం కేఎంసీలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా పదుల సంఖ్యలో మున్నేరు బాధితులు కమిషనర్‌ను కలిసి తమకు ఇంకా పరిహారం రాలేదని వాపోయారు. దీంతో స్పందించిన కమిషనర్ ప్రజావాణిలో వారి జాబితాలను పరిశీలించారు. ఎస్‌బీఐ, కరూర్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు ఇతర గ్రామీణ బ్యాంకుల నుంచి బాధితులకు డబ్బులు అందలేదని గుర్తించారు. దీంతో వెంటనే లీడ్ బ్యాంకు మేనేజరకు కమిషనర్ ఫోన్ చేశారు. తక్షణం పరిహారం అందేలా సంబంధిత బ్యాంకు మేనేజర్లతో మాట్లాడి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం రెవెన్యూ విభాగానికి చెందినవని గుర్తించారు. ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి పరిష్కరించాలని ఆర్వో శ్రీనివాసరావును ఆదేశించారు. ఖమ్మం నగరంలో ఖాళీ స్థలాల్లో నోటీసు బోర్డులు పెట్ట జరిమాన విధించమని ఆదేశించటం జరిగిందని ఎందుకు నోటీసులు ఇవ్వటం లేదని పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్యను కమిషనర్ ప్రశ్నించారు. ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారి వసుంధరను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి సమస్యలు వారం రోజులులోగా పరిష్కారం చేయాలని పదే పదే ప్రజావాణికి ఫిర్యాదుదారులు రాకుండా పరిష్కారం చూపాలని ఆదేశించారు.

పారిశుధ్య కార్మికుల హాజరు తనిఖీ

పారిశుధ్య కార్మికులు ఖచ్చితమైన సమయపాలన పాటించలని ప్రభుత్వం అందించే యూనిఫాం ధరించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం 19వ డివిజన్‌లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికుల హాజరును పరిశీలించారు. సమయపాలన, యూనిఫాం, ఆరోగ్య పరీక్షలపై కార్మికులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

నేలకొండపల్లిలో నేడు మెగా రక్తదాన శిబిరం

- నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్

నేలకొండపల్లి,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఖమ్మం రూరల్ పోలీస్‌సబ్ డివిజన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం నేలకొండపల్లి వ్యవసాయమార్కెట్ ఆవరణలో మెగా రక్తదానశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ చెప్పారు. సోమవారం నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో రక్త హీనతతో బాధపడే వారికి ఈరక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని ఉపయోగిస్తామని ఎస్ఐ చెప్పారు.

కార్పొరేటర్ జగన్ హఠాన్మరణం

- కుటుంబ సభ్యులతో కలిసి ఉండగా గుండెపోటు
- 3వడివిజన్‌లో విషాద చాయలు
- కన్నీటి పర్యంతమైన మంత్రి తుమ్మల



ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌సీనియర్ నాయకుడు, ఖమ్మం 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ (55) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఆదివారం ఉదయం ఖమ్మంలోని బల్లేపల్లిలో తన నివాసంలో కుటుంబ సభ్యులతో ఉన్నారు. వారితో మాట్లాడుతుండగా దవడ, మెడ నొప్పిగా ఉండటంతో వెంటనే ఖమ్మంలోని హాస్పటల్‌కు తరలించారు. రక్తపోటు తక్కువగా ఉందని ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యసేవలు అందించారు. తర్వాత పరీక్షలు జరపగా గుండెలోని మూడు వాల్స్ మూసుకు పోయాయని, వాటిలో ఒకవాల్‌కు శస్త్ర చికిత్స చేశారు. అనంతరం ఉన్నతస్థాయి వైద్యసేవలకు హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. కాగా అక్కడ కూడా బీపీతో పాటుగా ఇతర అనారోగ్య సమస్యలు పెరిగాయి.ఈక్రమంలో వైద్యసేవలు పొందుతూ మలీదు జగన్ కన్నుమూశారు.

కన్నీటి పర్యంతమైన మంత్రి తుమ్మల

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావుతో మలీదు జగన్‌కు సన్నిహిత రాజకీయ సంబంధాలు ఏర్పాడ్డాయి. 3వ డివిజన్ కార్పొరేటర్‌తో పాటుగా రఘునాథపాలెం మండల కాంగ్రెస్ బాధ్యులను మలీదు జగన్ పర్యవేక్షణ చేస్తున్నారు. మంత్రి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. మలీదు జగన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుటాహుటిన ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లారు. నివాళులు అర్పించి కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేశారని, తన డివిజన్ అభివృద్ధికి కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీ మంచి నాయకుడ్ని కోల్పోయిందని సంతాపం తెలిపారు. జగన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగేందర్, సాధు రమేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో మలీదు జగన్ కుటుంబ సభ్యులకు సహాయం అందించారు.



నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల

ప్రయోజనకర పనులు చేపట్టాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 19వ డివిజన్‌లో పనులకు శంకుస్థాపన



దుకాణాన్ని పరిశీలిస్తున్న తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పదికాలాల పాటు ప్రజలకు ప్రయోజనం కలిగే పనులను చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ఆదేశించారు. సోమవారం ఖమ్మంలోని 19వ డివిజన్‌లో రూ.1కోటి 55లక్షల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. కాల్వలకు ఎవ్వరి నివాసాలు అడ్డుగా ఉన్నా తొలగించాలని, అధికారులు వెనకడుగు వేయాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. జిల్లా అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడాల్సిన అవసరమే లేదన్నారు. ఇప్పుడు నిర్మాణం జరిగే రహదారులు భవిష్యత్‌లో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంకి లేకుండా ముందస్తు కార్యచరణ చేయాలన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన జిల్లా కేంద్రంగా ఖమ్మం రూపొందిస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకోల్లు నీరజ, రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, పాలేపు విజయవెంకటరమణ, వీపీపాలేం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నాని ఫైర్‌వర్క్స్ షాపు ప్రారంభించిన తుమ్మల

రఘునాదపాలెం: జిల్లాలోని వైరారోడ్డులోని రఘునాదపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో ఏర్పాటుచేసిన నానిఫైర్ హోల్‌సేల్ రిటైల్‌షాపును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రగిడ్డంగుల సంస్థచైర్మన రాయల నాగేశ్వరరావు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ముదిగొండ సొసైటీ అధ్యక్షుడు తుపాకుల యలగొండస్వామి తదితరులు పాల్గొన్నారు.







తిరుమలాయపాలెంలో కేక్‌కట్ చేస్తున్న శివరామకృష్ణ,నేలకొండపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ వెన్నపూస,కూసుమంచిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

నెట్‌వర్క్: కూసుమంచిలోని క్యాంపు క్యార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ రక్తదాన శిబిరాలను నిర్వహించారు. బైక్‌ర్యాలీ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్పోరేషన్ మాజీచైర్మన్ మద్దినేని స్వర్ణకుమారి పాల్గొన్నారు. తిరుమలాయపాలెం, సుబ్లేడు కాకరవాయి, పాతర్లపాడు, జల్లేపల్లి, తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. తిరుమలాయపాలెంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు కాంగ్రెస్ నాయకులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఖమ్మంలో పలు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు.





శుభాకాంక్షలు తెలుపుతున్న చింతనిప్పు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న గ్రానైట్ ట్రేడర్స్

నేడు తిరుమలాయపాలెంలో మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలో పర్యటిస్తున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకరరెడ్డి పేర్కొన్నారు. బీరోలులో చెరువు ఆధునీకరణ పనులకు ప్రారంభోత్సవం, గోల్‌తండా సమీపంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారని తెలిపారు. జల్లేపల్లి, పడమటితండాలో బాధితులను పరామర్శిస్తారన్నారు.

మద్యం మత్తులో యువకులు హల్‌చల్

- కీచైన్ కత్తితో ఒకరిపై దాడి
- మరొకరికి తీవ్రగాయాలు

ఖమ్మంక్రైం,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకులు హల్‌చల్ చేశారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హుజుర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు తనికెళ్లకు చెందిన ఇద్దరు యువకులు నగరంలోని లెనిన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఫూటుగా మద్యం సేవించారు. తినేందుకు గది నుంచి బయటకు వెళుతున్నారు. అదేసమయంలో సమీప ప్రాంతంలో ఉండే మరో యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. వీరు ఆ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో వారి మధ్య ఘర్షణ తలెత్తింది. అదేసమయంలో మద్యం మత్తులో ఉన్న ముగ్గురిలో ఒకరు బండి తాళాలకు ఉన్న కీచైన్‌కత్తిని తీసి ఎదురుగా ఉన్న యువకుడిపై దాడి చేశాడు. దీంతో అతడికి పక్క భాగంలో చిన్న గాయం కావడంతో డయల్ 100కు ఫోన్ చేశాడు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకునే లోపు దాడి చేసిన వారు అక్కడ నుంచి పారిపోయారు. ఈ సమయంలో నిందితుల్లో ఒకరు ఒకరి సెల్‌ఫోన్, కీచైన్ కత్తి అక్కడ పడిపోయాయి. గాయపడిన యువకుడు వాటిని తీసుకుని స్టేషన్‌వద్దకు వచ్చి పోలీసులకు విషయం చెప్పాడు. ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో, అక్కడ గాయానికి కుట్లు వెయించుకుని స్నేహితులకు విషయం చెప్పాడు. తన వద్ద సెల్‌ఫోన్ ద్వారా స్నేహితుల ద్వారా వారు సమీపంలోనే ఉంటారని తెలుసుకుని వారి రూమ్ వద్దకు వెళ్లారు. తెల్లవారు జామున మూడు గంటల సమయంలో వారిపై గాయపడిన వ్యక్తి స్నేహితులు దాడి చేశాడు. ముగ్గురిలో ఒకరికి తల గాయాలు అయ్యాయి. దీంతో బయపడిన ముగ్గురు ఇంటిపైకి వెళ్లి పోలీసులకు సమాచారం అందిచారు. ఇరువర్గాలను స్టేషన్‌కు తీసుకు వచ్చినట్లు తెలిసింది. కాగా ఇరువర్గాల సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హిజ్రాల పరస్పర ఫిర్యాదులు

ఖమ్మంరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఒకవర్గం హిజ్రాలపై మరోవర్గం హిజ్రాలు రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డబ్బుల వసూల విషయంలో హిజ్రాలు కొన్ని నిబంధనలు పెట్టుకున్నారు. ఖమ్మం సిటిలో కొందరు, గ్రామీణ ప్రాంతాల్లో కొందరు తిరగాలని నిబంధన పెట్టుకున్నారు. వీటిని ఖమ్మంసిటిలో తిరిగేవారు అతిక్రమించారు. గ్రామాల్లోకి వెళితే మాపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని గ్రామీణ ప్రాంతాల హిజ్రాలు ఆరోపించారు. మా పరిధి మేరకు బిక్షాటన చేసుకుంటుంటే మాపై ఖమ్మం హిజ్రాలు బెదిరింపులకు పాల్పడుతున్నారని రూరల్ మండలానికి చెందిన కొందరు సోమవారం ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నట్లు విలేకరులకు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్రస్థాయి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14, 17 బాలుర, బాలికల బ్యాడ్మింటన్ జట్లను సోమవారం సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపి క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హార్వెస్ట్ విద్యార్థులు



విద్యార్థులతో కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్- 19 కబడ్డీ, బాస్కెట్‌బాల్, షటిల్‌బ్యాడ్మింటన్, నెట్ బాల్ పోటీలకు హార్వెస్టు కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ వివరాలను పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి సోమవారం తెలిపారు. ఇటీవల నగరంలో జరిగిన ఎంపికల్లో బాస్కెట్‌బాల్‌లో షణ్ముఖప్రియ, తనూశ్రీ, లిఖిత, ప్రవల్లిక, జోసఫ్, మెహజబిన్, దివాకర్, విష్ణు, జుబీర్, సాయిలోకేష్ నెట్‌బాల్‌లో దివాకర్, లోకేష్, కబడ్డీలో విష్ణుకార్తీక్, బ్యాడ్మింటన్‌లో సుశాంత్, ముఖేష్, డేవిడ్, వివేక్ ఉత్తమ ప్రతిభ చూపి ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు.

టేబుల్ టెన్నిస్‌లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో నాగేంద్రకుమార్

ఖమ్మం స్పోర్ట్స్అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్‌లో తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గౌరిశెట్టి చార్విక్ డబుల్స్ విభాగంలో స్వర్ణ, ఎస్‌కే. ఫజల్ డబుల్స్ విభాగంలో స్వర్ణ, సింగిల్స్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారని పాఠశాల అధినేత రాజావాసిరెడ్డి నాగేంద్రకుమార్ తెలిపారు. సోమవారం పాఠశాలలో విజేతలను అభినందించారు. చదువుతో పాటు సృజనాత్మకతను వెలికి తీస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- భర్తకు తీవ్రగాయాలు

ఖమ్మంరూరల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, పోన్నేకల్లు వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం చెన్నారంగ్రామానికి చెందిన ఆవుల లక్ష్మీనారాయణ, పద్మ (45) దంపతులు ద్విచక్రవాహనంపై డోర్నకల్ మండలం, తొడాలగూడెం గ్రామంలోని ఓశుభకార్యానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామం చెన్నారం వస్తుండగా రూరల్ మండలం, పోన్నేకల్లు వద్ద వెనుక నుంచి లారీ వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. పద్మపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడి కక్కడే మృతిచెందింది. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఛిద్రమైంది. లక్ష్మీనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు లక్ష్మీనారాయణను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసునమోదు చేశారు.

హైదరాబాద్‌లో జిల్లావాసి..

నిజాంపేట్: డ్రైవర్‌పై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంజిల్లాకు చెందిన కె. సురేష్ (45) కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ప్రగతినగర్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. అప్పుడప్పుడు డ్రైవింగ్‌కు వెళ్తుంటాడు. సోమవారం ఉదయం చెత్త సేకరించే ట్రాక్టర్ తీసుకొని వెళ్లాడు. మధ్యాహ్నం అతడి భార్య ప్రశాంతికి ఇంటి యజమాని ఫోన్ చేశాడు. సాయినగర్ డంపింగ్ యార్డు సమీపంలో తీవ్రమైన గాయాలతో సురేష్ చనిపోయి ఉన్నాడని చెప్పాడు.ఆమె బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా

ఖమ్మంటౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలు తీర్చాలని, వ్యాపార విస్తరణ పేరుతో వారిని నిర్వీర్యం చేయాలని చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ భారతీయ బీమా ఏజెంట్ల సమాఖ్య లియాఫీ 1964 ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌ఐసీ ఖమ్మం బ్రాంచ్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు మందపల్లి లక్ష్మణ్, పసుమర్తి శంకర్‌రావు మాట్లాడుతూ 60 ఏళ్లుగా ఉన్న ఏజెంట్లకు ఇస్తున్న కమిషన్‌ను ఈనెల 1 నుంచి తగ్గించారన్నారు. వ్యాపార విస్తరణ పేరుతో ఐఆర్‌టీఏ ఏజెంట్ల వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని, సమ్‌ఇన్స్యూర్డును రూ.2లక్షలకు పెంచారన్నారు.

నేడు, రేపు స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాసంచాలకులు హైదబాద్ ఆదేశాలతో బుధ, గురు వారాల్లో నగరంలోని డైట్ కళాశాల టేకులపల్లిలో స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. 27 మంది ఎస్‌జీటీలకు, 8మంది స్కూల్ అసిస్టెంట్‌లకు 1:3 పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ పత్రాలతోపాటు ఆన్‌లైన్ చేసిన దరఖాస్తును వెంట తీసుకు రావాలని తెలిపారు.

నేడు సత్తుపల్లిలో డయల్ యువర్ డీఎం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో మంగళవారం సాయంత్రం 4గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం యూ.రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించాల్సిన వారు 9959225962 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అదేవిధంగా హైదరాబాద్‌లో 31ప్రాంతాలలో ఇంటి వద్దకే ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ఇంక నుంచి చేరవేయనున్నామని, డిపో పరిధిలో పార్సిళ్లను బుకింగ్ చేసుకునే విని యోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగిలిన వివరాలకు ఆర్టీసీ అధికారి ఎస్‌కే.మునీర్‌పాషా 9154298585నంబర్‌ను సంప్రదించాలని డీఎం కోరారు.

రైతుల కష్టాలు తీర్చేలా ప్రభుత్వ పథకాలు

» ఎమ్మెల్యే మట్టా రాగమయి


సత్తుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రైతుల కష్టాలను తీర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని పుల్లయ్యబంజరు గ్రామంలో సోమవారం మల్లికా గ్రామ సమైఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ దేవి, తహసీల్దార్ పి. సాంబశివుడు, ఏవో రూప, సీడీపీవో నిర్మలజ్యోతి, తొటకూర శేషగిరిరావు, బాగం ప్రభాకరచౌదరి, కొండపల్లి శ్రీమన్నారాయణ, లక్కినేని రమేష్, కొండలు, బుర్రి వీరయ్య, మల్లికా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

సత్తుపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యగారిపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సోమవారం ప్రారంబించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడలోని పత్తి జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంబించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ తదితరులు ఉన్నారు.

పెనుబల్లి: నీలాద్రీశ్వరస్వామి ఆలయంలో నవంబరు 2నుంచి జరిగే కార్తీకమాస పూజా కార్యక్రమాల పోస్టర్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం ఆవిష్కరించారు.

నేడు మధిర నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పర్యటన

మధిర/బోనకల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం మధిర నియోజకవర్గంలోని మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో పర్యటించనున్నారు. మధిర (మంజిత్ జిన్నింగ్ మిల్)లో పత్తి కొనుగోలును ప్రారంభిస్తారు. బోనకల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వైరా మహిళకు ప్రథమ బహుమతి

వైరా, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఆది యోగా పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వైరా మునిసిపాలిటీలోని బ్రహ్మణపల్లి అగ్రహారానికి చెందిన రచ్చకొండ పద్మావతి ప్రథమ బహుమతిని దక్కించుకున్నారు. హైదరాబాద్‌లోని రామంతపూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పద్మావతి ఈ బహుమతిని పొందారు. అంతర్జాతీయ ఆది యోగా ఫౌండేషన్ కార్యదర్శి కె. రాజశేఖర్ ఈ బహుమతిని ఆమెకు అందజేశారు.

'ఉద్యోగులకు న్యాయం చేయాలి'

సత్తుపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ. నాగమల్లేశ్వరరావు కోరారు. సోమవారం రాత్రి సత్తుపల్లిలో జరిగిన సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

నెట్‌వర్క్: రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలను చేపట్టారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావులు అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. కారేపల్లి క్రాస్‌రోడ్డుకు చెందిన ఉప్పు సాయిరాం తన ఛాతిపై మంత్రి పొంగులేటి చిత్రపటాన్ని పచ్చబొట్టు వేయించుకున్నాడు.


వైరాలో జైపాల్‌కు స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్


కొణిజర్ల గురుకులంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బోనకల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో సోమవారం జరిగిన కామ్రేడ్ ఎర్రబోయిన నాగేశ్వరరావు వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సీతారాం ఏచూరి లేకపోతే ఇండియా కూటమి ఏర్పడి ఉండేది కాదన్న విషయాన్ని స్వయంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, ఏడునూతల లక్ష్మణరావు, మాదినేని నారాయణ, మాదినేని వీరభద్రం, కారంగుల చంద్రయ్య, జొన్నలగడ్డ సునిత తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు మంజూరు చేయండి

కొణిజర్ల, అక్టోబరు28: తనికెళ్ల గ్రామం మీదుగా పెద్ద పెద్ద టిప్పర్లతో మట్టితోలకాలు జరుపుతున్నారని, దీంతో ఉన్న రోడ్డు దెబ్బతింటుందని, నూతనంగా తారురోడ్డు నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మట్టి తోలకాలు జరపడం ద్వారా ఇప్పటికే చాలా వరకు రోడ్డు దెబ్బతిన్నదని వారు కలెక్టర్‌కు వివరించారు. దెబ్బతిన్న రోడ్డుస్థానంలో కొత్తరోడ్డు నిర్మించాలని కోరారు.

పత్తి పంటకు మద్దతు ధర ఇవ్వాలి

» సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరేల్లి కృష్ణ

కారేపల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రైతు లు పండించిన పత్తిపంటకు ప్రభుత్వం మద్దతు ధర రూ.10వేలు ప్రకటించాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరేల్లి కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పోలూరి శ్రీనివాస్, భూక్య శివనాయక్, బాణోత్ రాంసింగ్, ఒగురి వెంకన్న, సతీస్, రాజి, లాలు, నాగమణి, శిరీష, బీమ్‌రెడ్డి, గుర్రం సత్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చందర్‌రావు ఎన్నిక


చందర్‌రావును అభినందిస్తున్న మల్లు నందిని

కల్లూరు, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కల్లూరుకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు పసుమర్తి చందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఖమ్మంలో జిల్లా ఆర్యవైశ్యం సఘం అధ్యక్ష ఎన్నికకు గాను జరిగిన నామినేషన్ ప్రక్రియలో కల్లూరు ప్రాంతం నుంచి చందర్‌రావు ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. పలు మండలాలకు చెందిన ఆర్యవైశ్య కమిటీలు ఆయన ఎన్నికను ఏకగ్రీవం చేస్తూ తీర్మానించారు. దీంతో ఆయన ఎన్నిక లాంఛనమైంది. ఎన్నికల అధికారులుగా దోసపాటి వెంకటేశ్వరరావు, చారగుళ్ల శ్రీనివాసరావులు వ్యవహరించారు..

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా చందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని నేరుగా చందర్‌రావును కలుసుకొని సత్కరించి అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌లు నేరుగా ఫోన్‌లో చందర్‌రావుతో మాట్లాడుతూ శుభాకంక్షలు తెలుపుతూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు రంగా హనుమంతరావు, రాయాల బసవేశ్వరరావు, సముద్రాల పురుషోత్తం తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మధిర ప్రాంత అభివృద్ధికి డిప్యూటీ సీఎం భట్టి పెద్దపీట

మధిరరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అభివృద్ధికి భట్టి విక్రమార్క పెద్దపీట వేస్తున్నారి మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మారంశెట్టి కిషోర్ తెలిపారు. మండలంలోని రొంపిమల్ల క్రాస్‌రోడ్ వద్దనుంచి రాచంద్రాపురం వరకు డబుల్‌బీటీరోడ్డు నిర్మాణానికి భట్టి రూ.25కోట్లు నిధులు మంజూరుచేయించారు. ఈరోడ్డును కాంగ్రెస్ నాయకులు సోమవారం పరిశీలించి శంకస్థాపన చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో మండ ల ఎస్సీసెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, దుంప వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, రాంబాబు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

'పాఠశాల అభివృద్ధికి వెంకట్రామయ్య విశేష కృషి'


వెంకట్రామయ్యను సన్మానిస్తున్న దృశ్యం

తల్లాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం బిల్లుపాడు ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుడు దిరిశాల వెంకట్రామయ్య విశేష కృషి చేశారని ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ కొనియాడారు. బిల్లుపాడు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దిరిశాల వెంకట్రామయ్య పదవీవిరమణ సందర్భంగా సోమవారం పి.కరుణ అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ జరిగింది. ఈ సభలో దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ దాతలను సమీకరించి పాఠశాల మౌళిక సౌకర్యాలను వెంకట్రామయ్య మెరుగుపర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నర్సింహారావు, రిటైర్డ్ ఎస్ఈ పెంట్యాల పెద్దవెంకట్రామయ్య, తెలుగునాడు ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్షుడు జీవీ.సూర్యప్రకాశరావు, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి దగ్గుల కమలాకర్‌రెడ్డి, ఉంగరాల వెంకటేశ్వర్లు, ఆవుల నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు జోసఫ్, రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ దీవెల కృష్ణయ్య, సామినేని రామఅప్పారావు, దిరిశాల సత్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ముదిగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహేష్(26) అనే యువకుడు మ ద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోపణలపై విచారణ

తల్లాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కుర్నవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో వచ్చిన ఆరోపణలపై సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌కుమార్ సోమవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, సీఈవో ఒగ్గు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి కళాశాలకు జాతీయస్థాయి అవార్డు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో తమ కళాశాల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలకు ఎక్సెంట్ అడ్మినిస్ట్రేషన్, క్వాలిటీ ఎడ్యుకేషన్ అండ్ ప్లేస్‌మెంట్స్ అవార్డు-2024ను అందుకుని తమ ఖ్యాతిని మరింత ఇనుమడించబడిందని కళాశాల డైరెక్టర్ దాసరి ప్రభాకర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23ఏళ్లుగా సమాజం పట్ల అచంచలమైన నిబద్ధతతో విద్య, సామాజిక కార్యక్రమాలలో సేవలందిస్తున్నందుకుగానూ ఈ అవార్డు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

వరిపైర్ల పరిశీలన

తల్లాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో సోమవారం వరిపైర్లను వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ పణిశ్రీ పరిశీలించారు. నేరుగా వరి విత్తే విధానం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఈవో త్రివేణి, శ్రీకాంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన

మధిర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏజెంట్లు, పాలసీదారులకు నష్టం వాటిల్లే విధంగా తీసుకున్న పలు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం మధిర ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా సమాఖ్య అధ్యక్షులు పత్తిపాటి కృష్ణారావు మాట్లాడారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు పత్తిపాటి కృష్ణారావు, కార్యదర్శి నరేష్‌బాబు, ఉపాధ్యక్షులు రంగారావు, కార్తీక్ సుందర్, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, లక్ష్మీనర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

'దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి'

సత్తుపల్లిరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): సమగ్రత సంస్కృతి-దేశ పురోభివృద్ధిలో భాగంగా సింగరేణి ఉద్యోగులంతా తమ పాత్రను ప్రముఖంగా పోషించాల్సి ఉందని కిష్టారం ఓసీ మేనేజర్ బీ.రామకృష్ణ అన్నా రు. సోమవారం ఓసీలో నవంబరు3వ వరకు జరుగనున్న విజిలెన్స్ వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ మేనేజర్ వీ.బాబు, ఇంజనీర్ మాధవరావు, సంక్షేమాధికారి విజయ్‌సందీప్, పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు ఎంపిక

పెనుబల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పునాకొషి షాట్‌ఖల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో అండర్-19 ఎస్‌జీఎఫ్ఐకు టైగర్ కరాటే స్కూల్ వీఎంబంజర్ విద్యార్థి అరుణ్‌తేజ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆర్.బాలకృష్ణ తెలిపారు. నవంబరులో గోవాలో జరిగే వరల్డ్ కరాటే చాంపియన్‌కు కూడా అరుణ్‌తేజ్ ఎంపికైనట్లు టైగర్ కరాటే స్కూల్ వ్యవస్థాపకులు జ్యోతి, శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా కరాటే పోటీల్లో ప్రతిభ సాధించిన అరుణ్‌తేజ్‌ను పలువురు అభినందించారు.

భార్యపై దాడి చేసిన కేసులో భర్తకు జైలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తామామలపై భర్త దాడిచేసిన కేసులో రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ సత్తుపల్లి సబ్ జడ్జి ఎస్‌కే.మీరాఖాసీంసాహెబ్ సోమవారం తీర్పు ఇచ్చారు. పెనుబల్లి మండలం తాళ్లపెంటకు చెందిన కాటినేని శ్రీనుతో ఏడేళ్ల క్రితం సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేటకు చెందిన తాటినేని ఉమతో వివాహమైంది. భార్యను తరచూ అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండటంతో పుట్టింటికి వచ్చేసింది. కాగా భార్య ఉమను హత్య చేసేందుకు 2017ఏప్రిల్ 27వ తేదీ రాత్రి 11.30ల సమయంలో భర్త శ్రీను ఇనుపరాడ్డుతో దాడి చేస్తుండగా అడ్డువెళ్లిన అత్తామామలు రాధ, మారేశ్వరరావులపై కూడా దాడిచేస్తూ కళ్లల్లో కారం కొట్టి పరారయ్యాడు. బాధితులు అప్పటి సత్తుపల్లి పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం నిందితుడు శ్రీనుకు రెండేళ్ల పాటు జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కోర్టు కానిస్టేబుల్ సీహెచ్.శ్రావణ్, హోంగార్డు ప్రవీణ్‌లు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.